విద్యుత్ సమస్యలకు తక్షణ పరిష్కారం

- 1912కు ఫోన్ చేయండి
- సీజీఆర్ఎఫ్ చైర్మన్, జోన్–2 ఈఈ



జోన్–2 కార్యాలయంలో మాట్లాడుతున్న సీజీఆర్ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ



గౌరీ డిగ్రీ కళాశాల సదస్సులో పాల్గొన్న విద్యార్థులు, వినియోగదారులు

కంచరపాలెం: ఏపీఈపీడీసీఎల్ జోన్–2 డివిజన్ పరిధిలో సోమవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట కార్యాలయం, ఊర్వశి జంక్షన్‌లోని గౌరీ డిగ్రీ కళాశాలల్లో ఈ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం(సీజీఆర్ఎఫ్) చైర్మన్, రిటైర్డ్ న్యాయమూర్తి బి.సత్యనారాయణ, సంస్థ జోన్–2 ఈఈ బి.కోటేశ్వరనాయుడు మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, హెచ్చు తగ్గులు, బిల్లుల్లో సమస్యలు, కొత్త సర్వీసుల జారీలో జాప్యం, బిల్లులో పేరు మార్పిడి, సరఫరా పునరుద్ధరణలో ఇబ్బందులు, నియంత్రికల మార్పిడి తదితర సమస్యలు, సందేహాలను నివృత్తి చేశారు. విద్యుత్ సమస్యలు, సరఫరాలో అంతరాయాలపై 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. అనంతరం సబ్ డివిజన్‌లో ఏఈ, డిప్యూటీ ఈఈ, ఈఈలతో సత్యనారాయణ, కోటేశ్వరనాయుడు సమావేశం నిర్వహించారు. సదస్సులో అందిన విద్యుత్ ఫిర్యాదులపై సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులకు వారు ఆదేశించారు. సమావేశంలో ఫారం మెంబర్ హరిబాబు, ఇతర అధికారులు, గౌరీ కళాశాల విద్యార్థులు అధ్యాపకులు పాల్గొన్నారు.

రైల్వే ఆస్తులను కాపాడుకుందాం



ఆర్పీ పేట హైస్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్ అధికారులు

కంచరపాలెం: రైల్వే ఆస్తులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని రైల్వే భద్రతా దళ(ఆర్పీఎఫ్) అధికారులు పిలుపునిచ్చారు. రామూర్తిపంతులుపేట జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో 56వ వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ నేతృత్వంలో సోమవారం ఆర్పీఎఫ్ సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుపై ఆకతాయిలు చేస్తున్న ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ఆర్పీఎఫ్ సీఐ పి.మోహన్‌రావు, ఎస్ఐ రాజురంజన్ మాట్లాడుతూ వందే భారత్ రైలుపై ఆకతాయిలు రాళ్లు వేయడం దుశ్చర్య అన్నారు. నడుస్తున్న రైళ్లపై రాళ్లు విసరడం వల్ల అవి ప్రయాణికులకు తగిలి గాయాలపాలయ్యే అవకాశముందని, ఇటువంటి పనులు మానుకోవాలని కోరారు. రైల్వే ఆస్తులకు నష్టం కలిగించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలల విద్యార్థులు రైల్వే ట్రాక్‌లపై సెల్ఫీలు వంటి ప్రమాదకరమైన పనులు, నిషిద్ధ ప్రాంతాల్లో రైల్వే ట్రాక్‌లు దాటడం వంటి పనులు చేయకూడదని అవగాహన కల్పించారు.

ఆకతాయిలకు దూరంగా ఉండండి..

కంచరపాలెం లా అండ్ ఆర్డర్ ఎస్ఐ దివ్యభారతి మాట్లాడుతూ కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో ఆగతాయిల ఆగడాలు శృతిమించుతున్నాయని, పాఠశాలల్లో విద్యార్థులు జాగ్రత్తగా నడుచుకోవాలన్నారు. కంచరపాలెం పరిధిలో వందే భారత్ రైలుపై ఆకతాయిలు రాళ్లు విసిరిన ఘటన జరగడం మచ్చగా మిగిలిందన్నారు. బాలికలు ఆకతాయిలతో చెడు సావాసం చేయొద్దని సూచించారు. చిన్నారులపై లైగింక వేధింపులు, దూషణలు సరికాదని, వారితో స్నేహంగా మెలగాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆర్.శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.రమేష్‌గౌరీ, సోషల్ వర్కర్ కె.వెంకటేశ్వరరావు, సీఆర్పీ ఎల్.చైతన్య, ఉపాధ్యాయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విశాఖ చేరుకున్న వెంకయ్యనాయుడు



విశాఖ విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న వెంకయ్యనాయుడు

గోపాలపట్నం: నగరంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సోమవారం విశాఖ చేరుకున్నారు. హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో మధ్యాహ్నం వచ్చారు. ఆయన నేరుగా రోడ్డు మార్గాన నగరంలోకి వెళ్లారు.

జోన్–5 'స్పందన'కు నాలుగు వినతులు



వినతులు పరిశీలిస్తున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురం జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో పలు సమస్యలు పరిష్కారం కోసం నాలుగు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ నేరుగా వినతులు స్వీకరించారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి– 03, పబ్లిక్ హెల్త్ విభాగానికి 01 వినతులు అందినట్లు జెడ్సీ కృష్ణ తెలిపారు. ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్లు టీఎస్ఎస్ రాజు, ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వో బూబురావు, ఈఈ టి.ప్రసన్నరెడ్డి, వాటర్ డీఈ శ్రీనివాసవర్మ, టౌన్‌ప్లానింగ్ టీపీవో ఎం.శ్రీలక్ష్మి, అపరంజిత, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఐ దృష్టికి సమస్యలు



సీఐ లూథర్‌బాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మల్కాపురం గ్రామ కమిటీ ప్రతినిధులు

మల్కాపురం: మల్కాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ లూథర్‌బాబును సోమవారం మల్కాపురం గ్రామ కమిటీ ప్రతినిధులు భోగవిల్లి నాగభూషణం, సత్యాలు, మహేష్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తమ గ్రామంలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. విధి నిర్వహణలో పోలీసులకు తమ గ్రామ కమిటీ తరఫున పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ప్రతినిధులు తెలిపారు.

ప్రజా సంపదను కాపాడండి




ఎస్‌బీఐ వద్ద ధర్నా చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

గాజువాక : ఎల్ఐసీ, ఎస్‌బీఐలలో ప్రజలు దాచుకున్న ధనాన్ని కాపాడాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ రెండు సంస్థల నుంచి వేల కోట్ల ప్రజాధనాన్ని కేంద్ర ప్రభుత్వం అదానీ గ్రూప్‌కు ధారాదత్తం చేసిందంటూ కణితి రోడ్‌లోని ఎస్‌బీఐ వద్ద నాయకులు సోమవారం ఆందోళనకు దిగారు. పీసీసీ ప్రతినిధి జెర్రిపోతుల ముత్యాలు మాట్లాడుతూ ప్రజా ధనాన్ని అక్రమంగా అదానీ గ్రూపునకు ఇవ్వడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటి దుర్మార్గమైన నిర్ణయాలతో దేశం తిరోగమనంలోకి వెళ్తుందని, ఎన్డీఏ ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి పంపించే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కొవిరి కోదండరావు, ఎం.వర్మ, యరబాల భూలోక, కట్టా అప్పారావు, రాజు, ఆనంద్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కరెంటు తీగలతో కలవరం



గంగన్ననగర్‌లో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు



కొత్తరెడ్డి కంచరపాలెంలో చెట్ల కొమ్మల్లో కరెంటు తీగలు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం పరిధిలో పలు చోట్ల కరెంటు తీగలు స్థానికులను కలవరపెడుతున్నాయి. జోగారావునగర్, యల్లబిల్లివారి వీధి, గంగన్ననగర్, కొత్త రెడ్డికంచరపాలెం ప్రాంతాల నుంచి కంచరపాలెం బీఆర్‌టీఎస్ నేతాజీ కూడలికి వెళ్లే రహదారుల్లో విద్యుత్ లైన్లు ప్రమాదకరంగా మారాయి. ఆయా ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగులుతుండటంతో అగ్నితుంపరలు వెదజల్లుతున్నాయి. స్థానికులతోపాటు అటుగా రాకపోకలు సాగిస్తున్న పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. బలమైన గాలులు వీచే సమయాల్లో ఆందోళనకరంగా ఉంటోందని వాపోతున్నారు. యల్లబిల్లివారి వీధి నుంచి గంగన్ననగర్‌కు వెళ్లే 65బీ/9, 65బీ/9/ఏ, 65బీ/10 విద్యుత్‌స్తంభాల వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ సమస్యపై ఏపీఈపీడీసీఎల్ జోన్–2 కార్యాలయంలో ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టిసారించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వర్సిటీకి విద్యార్థులే గర్వకారణం



ఎన్ఎస్ఎస్ వలంటీర్లను అభినందిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: భారత ప్రభుత్వం ఇటీవల ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న ముగ్గురు జాతీయ సేవా పథకం వలంటీర్లను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. వర్సిటీకి చెందిన జె.వాసు, వి.ఎస్.ఎన్.లక్ష్మణ్, పి.రమ్య గత నెల 1 నుంచి 25వ తేదీ వరకు ఢిల్లీలో శిక్షణ పొంది 26న నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో పాల్గొన్నారు. వీరితో పాటు రాష్ట్రపతి అవార్డు సాధించిన ధనియాల సాయిని కూడా ఆయన అభినందించారు. గణతంత్ర వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు పెరేడ్ విశేషాలు, ఢిల్లీలో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాన మంత్రి, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రిని కలిసిన సందర్భాలను వివరించారు. విశ్వవిద్యాలయానికి గర్వకారణంగా విద్యార్థులు నిలుస్తున్నారని వీసీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, ఐటీఐ సమన్వయకర్త డాక్టర్ పి.రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

హోం గార్డు నిజాయితీ

నగదుతో దొరికిన పర్సు అప్పగింత



పోగొట్టుకున్న పర్సు అందిస్తున్న సీఐ రంగనాథం

సబ్బవరం: సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న హోం గార్డుకు నగదుతో దొరికిన పర్సును పోలీస్ స్టేషన్‌కు అప్పగించి తన నిజాయితీ చాటుకున్నాడు. వివరాలు.. కాళ్ల కోటేశ్వరరావు అనే హోం గార్డు సబ్బవరం మూడు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఆయనకు నగదుతో ఉన్న పర్సు దొరకడంతో పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. పోలీసులు పర్సును పరిశీలించగా అందులో రూ.7,600 నగదుతో పాటు ఆధార్ కార్డు, సీ బుక్ ఉన్నాయి. వాటిలో ఉన్న అడ్రస్ ఆధారంగా విచారణ చేయడంతో పర్సు పోగొట్టుకున్న వ్యక్తి ఇరువాడకు చెందిన గొంతిన సత్తిబాబుగా గుర్తించారు. దీంతో సోమవారం పోలీస్ స్టేషన్‌లో సీఐ రంగనాథం హోమ్ గార్డు చేతులమీదుగా సత్తిబాబుకు పర్సును అందజేశారు. హోమ్ గార్డును అభినందించారు. నిబద్ధతతో విధులు నిర్వహించడంతో కోటేశ్వరరావు గతంలో అనేకసార్లు ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

శ్మశానవాటికలో అభివృద్ధి పనుల పరిశీలన



కరాసా శ్మశానవాటికలో పనులు పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, అధికారులు

గోపాలపట్నం: కరాసా హిందూ, క్రిస్టియన్, ముస్లిం శ్మశానవాటికలో సోమవారం జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పర్యటించారు. ఇక్కడి మూడు శ్మశానవాటికల అభివృద్ధికి సుమారు రూ.3 కోట్లతో పనులు చేపడుతున్నారు. అవి జరుగుతున్న తీరును పరిశీలించారు. శవ దహన షెడ్లు, గెడ్డ రిటర్నింగ్ వాల్, నీటి సౌకర్యం వంటి పనులు జరుగుతున్నాయి. వీటి నిర్మాణంలో నాణ్యత లోపాలు లేకుండా పనులు చేపట్టాలని ఆయన సూచించారు. మర్రిపాలెం వుడా లేఅవుట్ వాకింగ్ ట్రాక్‌లో జిమ్ ఎక్విప్‌మెంట్, గ్రిల్స్ నిర్మాణ పనులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ శ్మశానవాటికలో ప్రస్తుతం జరుగుతున్న పనులు పూర్తయిన తరువాత రోడ్లు, మౌలిక సదుపాయాలు వంటి పనుల కోసం ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. ఈ మూడు శ్మశానవాటికలను మోడల్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. సుందరీకరణ పనులు చేపడతామన్నారు. డీఈ ఏడుకొండలు, ఏఈ ఉషా, వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

విశ్రాంత పోలీస్ అధికారుల కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న విశ్రాంత పోలీస్ అధికారులు

బీచ్ రోడ్డు: విశ్రాంత పోలీస్ అధికారుల అసోసియేషన్ విశాఖపట్నం రేంజ్ నూతన కార్యవర్గం ఎన్నిక సోమవారం బీచ్ రోడ్డులోని ఓ హోటల్‌లో జరిగింది. అధ్యక్షుడిగా మాజీ ఐపీఎస్ లక్ష్మణ్ మోహన్, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా కె.రామకృష్ణ, కార్యదర్శిగా ఎన్.ఎస్.ప్రసాద్ ఎన్నికయ్యారు.

తెలుగు సినీ ఉత్సవం ప్రారంభం



కె.విశ్వనాథ్, జమున చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న సినీ దర్శకుడు వి.ఎన్.ఆదిత్య

సీతంపేట: తెలుగు సినిమా ఉత్సవం ఘనంగా ప్రారంభమైంది. తెలుగు తొలి టాకీ సినిమా భక్తప్రహ్లాద 1932 ఫిబ్రవరి 6న విడుదలై 91 ఏళ్లు పూర్తయిన సందర్భంగా వైజాగ్ ఫిల్మ్ సొసైటీ మూడు రోజుల పాటు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తోంది. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సోమవారం సాయంత్రం సినీ దర్శకుడు వి.ఎన్.ఆదిత్య జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ముందుగా సినీ దిగ్గజాలు కె.విశ్వనాథ్, జమున చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదిత్య మాట్లాడుతూ మానవ విలువలను స్పృశించే సినిమాలను ప్రజలకు చేరువ కావాలని ఫిల్మ్ సొసైటీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విశాఖలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని, సినీ ప్రేక్షకులు ఒక కమిటీగా ఏర్పడి పాలకులపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. తాను ఇక్కడే చదివానని, విశాఖపై పూర్తి అవగాహన ఉందని, అందుకే తన చిత్రాలు ఎక్కువగా ఇక్కడే షూటింగ్ చేశానని, భవిష్యత్‌లో కూడా కొనసాగిస్తానని తెలిపారు. అనంతరం కళాతపస్వి కె.విశ్వనాథ్ దర్శకత్వంలో జమున నటించిన ఉండమ్మా బొట్టు పెడతా చిత్రాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, భరణికాన రామారావు, ఆచార్య ఎస్.ఎ.డి.పాల్, కాశీవిశ్వేశ్వరరావు, సుసర్ల శ్రీనివాస్, బి.చిన్నారావు పాల్గొన్నారు.

మౌలిక వసతుల మెరుగుకు కృషి

- 19వ వార్డు క్షేత్ర స్థాయి పర్యటనలో జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు



19వ వార్డు తీరంలో పర్యటిస్తున్న కమిషనర్ రాజాబాబు

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డులో మౌలిక వసతుల మెరుగుకు కృషి చేస్తానని జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు తెలిపారు. క్షేత్ర స్థాయిలో పర్యటనలో భాగంగా ఆయన సోమవారం 19వ వార్డులోని పెదజాలరిపేట, శివగణేష్‌నగర్, రేసవానిపాలెం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల వెంబడిన ఉన్న తీర ప్రాంత పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు మౌలిక వసతుల కల్పనకు సంబంధించి పలు అంశాలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. పెదజాలరిపేటలో గెడ్డ నిర్మాణం, వీధి దీపాల సమస్య, ఈపీడీసీఎల్ యాజమాన్యం పూడ్చకుండా వదిలేసిన గోతులు, శ్మశానవాటికకు రక్షణ గోడ నిర్మాణం, రేసవానిపాలెం గెడ్డ ద్వారా తీరంలో కలుస్తున్న చెత్తా చెదారం నిర్మూలన, తదితర సమస్యలను కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నొల్లి నూకరత్నం, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి శాస్త్రీ, డీసీ ఫణిరామ్, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలో కొనసాగించాలి



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

కూర్మన్నపాలెం: కార్మికుల కష్టానికి కేంద్ర ప్రభుత్వం విలువనిచ్చి, విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలి వద్ద సీపో, సీపీపీ, వీయూపీపీసీ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 725వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ప్రజారచయిత్రుల వేదిక జాతీయ అధ్యక్షురాలు మల్లేశ్వరి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కాత్యాయినీ విద్మహే, ప్రముఖ వకీల్ జవహారా, శాంతి ప్రబోధ అరుణజ్యోతి, తిరునగరి దేవకి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకుడు జె.అయోధ్యరామ్, మల్లేశ్వరి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మాలని ప్రకటించడం కార్మికుల జీవితాలతో ఆడుకోవడమే అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యోగులు, కార్మికులు, మేధావులు, విద్యార్థులు, కళాకారులు, రచయితలు పెద్ద ఎత్తున ఉద్యమాన్ని చేస్తున్నారన్నారు. ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మలచి మరింత ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కె.బాబూరావు, తాండ్ర కనకరాజు, ఎస్.జ్యోతిప్రసాద్, శివరామకృష్ణ, ఎం.శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ నాయకులు కొమ్ము ప్రసాద్, సుబ్బారావు, సీఐటీయూ నాయకులు కె.ఆనంద్‌కుమార్, కొల్లి నాగేశ్వరరావు, పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.

యజ్ఞ యాగాలతో ప్రపంచ శాంతి



వ్రతం నిర్వహిస్తున్న సామవేదం షణ్ముఖశర్మ



పాల్గొన్న 108 మంది దంపతులు

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ
- వైభవంగా సామూహిక శ్రీరామదేవుని వ్రతం

ఎంవీపీ కాలనీ: యజ్ఞాలు, యాగాలు, క్రతువులు ప్రపంచ శాంతికి వారధుల లాంటివని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–6లోని ఏబీసీ పార్కులో నిర్వహిస్తున్న శ్రీశక్తి పంచాయతన యోగ పూర్వక శ్రీసౌందర్య లహరి ప్రవచన మహోత్సవాల్లో భాగంగా ఆయన 108 మంది దంపతులతో సామూహిక శ్రీరామదేవుని వ్రతం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతిని నెలకొల్పే యజ్ఞాలు భారతీయ సనాతన సంస్కృతిలో భాగమన్నారు. సమాజానికి మంచి చేసే ఆ సంస్కృతిని ప్రతిఒక్కరూ ఆచరించాలని సూచించారు. వేదాల విజ్ఞానం ఆధునిక సమాజానికి సైతం మార్గదర్శకంగా నిలుస్తుందన్నారు. కేవీఎస్ శ్యామ్, అరుణ గాయత్రి దంపతుల నేతృత్వంలో నిర్వాహకులు వీవీ ఆదినారాయణ, దొంతకుర్తి శ్రీనివాస్ ఈ వ్రతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 108 మంది దంపతులు పాల్గొన్నారు.

అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న టెంపుల్ ఇన్‌స్పెక్టర్

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సోమవారం కె.కోటపాడు మండలం రొంగలి నాయుడుపాలేనికి చెందిన కొల్లి శివప్రసాద్ లక్షా 1116 రూపాయల విరాళం అందజేశారు. దాతకు బాండ్‌ను ఆలయ ఇన్‌స్పెక్టర్ కనకరాజు అందజేసి స్వామి దర్శనం కల్పించారు.

నూతన వేతనాలు అమలు చేయాలని దీక్ష



దీక్షలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు వెంటనే నూతన వేతనాలు అమలు చేయాలని స్టీల్ ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం రిలే దీక్షలు చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ సెయిల్ కార్మికులకు వేతన ఒప్పందం అయిన వెంటనే నూతన వేతనాలను అమలు చేశారని తెలిపారు. ప్రతీ దానికి సెయిల్‌ను అనుసరించే విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సెయిల్‌లో కొత్త వేతనాలు అమలు చేసి 15 నెలుల అవుతున్నా, ఇక్కడ అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. వెంటనే యాజమాన్యం చర్యలు చేపట్టకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. యూనియన్ మిత్ర పక్షాలు, ఇతర సంఘాల నాయకులు పాల్గొని దీక్షలకు మద్దతు తెలిపారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడ సేవ ఘనంగా జరిగింది

ప్రకృతి విపత్తుల సమయంలో తక్షణ స్పందన



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో శ్రీరామమూర్తి

సింహాచలం: ప్రకృతి విపత్తులు జరిగినప్పుడు తక్షణమే స్పందించాలని ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు, ఎన్ఎస్ఎస్, వలంటీర్లకు జిల్లా పరిషత్ సీఈవో పి.శ్రీరామమూర్తి సూచించారు. పెందుర్తి టీటీడీసీలో సోమవారం ఆపదమిత్ర శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈనెల 17వతేదీ వరకు నిర్వహించనున్న కార్యక్రమాన్ని సీఈవో శ్రీరామమూర్తి ప్రారంభించారు. ప్రకృతి విపత్తులు జరిగినప్పుడు తక్షణమే స్పందించాలని, సాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కృష్ణమోహన్, పెందుర్తి ఎంపీడీవో కె.వెంకటరావు, టీవోటీ కె.కరుణాకర్, రిసోర్స్ పర్సన్లు మహేష్, టి.సుధాకర్, ఎన్డీఆర్ఎఫ్ హెడ్‌కానిస్టేబుళ్ల ఢిల్లేశ్వరరావు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.